# చేపల చెరువుల తవ్వకానికి రంగం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి) పెద్ద రైతులు చేపల చెరువులుగా మార్చేందుకు ముందుకు వచ్చారు. ఇలా అంగలూరును ఆనుకునే ఉన్న దింటకుర్రు డొంక నుంచి బాడవ డొంక వరకూ గల దాదాపు 200 ఎకరాలను తవ్వేందుకు సిద్ధమయ్యారు. అనుమతుల కోసం రంగం సిద్ధం చేశారు. గ్రామంలోని తాగు నీటి వనరులు, భూగర్భజలాలు కలుషితం అవుతాయని, ఉపాధి ఉండదని, గ్రామంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటాయని, దిగువున కొత్తకోడు కిందనున్న 750 ఎకరాల భూములకు సాగు నీరు అందని పరిస్థితి నెలకొంటుందని గుర్తించారు. అలా వారు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవడం, వీరు అభ్యంతరం పెట్టడం చాల కాలంగా జరుగుతోంది. పలు మార్లు జిల్లా కలెక్టర్‌కు, మంత్రి పిన్నమనేనికి ప్రజాపథంలోనూ వినతిపత్రాలు ఇచ్చారు. తవ్వకాలు వీలుకాదంటూ హామీలు ఇచ్చారు. అయితే గతంలో ఎమ్మార్వో ఒకరు రహస్యంగా స్టీరింగ్ కమిటీ వేసి, నివేదిక ఇవ్వడంతో వివిధ శాఖల అనుమతులు పూర్తై నేడు ఆర్డీవో నుంచి ఫిషరీస్ శాఖకు ఫైల్ తుది అనుమతి నిమిత్తం చేరిందని వ్యవసాయకూలీల సంఘం ఆరోపిస్తోంది. దీనికి జిల్లాకు చెందిన మంత్రి ఒకరు మద్దతు ఇస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. అందుకే రెండేళ్లుగా లేని విధంగా అనుమతుల ఫైల్ శరవేగంగా కదులుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నేడు తవ్వకానికి అనుమతిస్తే అంగలూరు పరిసరాల్లోని జిమ్మారెడ్డి దొడ్డి, చెరుకుపల్లి దొడ్డి, వడ్డ చెరువు దొడ్డి, ఆవుదొడ్డి ప్రాంతాల్లోని దాదాపు 300-500 ఎకరాలు వచ్చే సంవత్సరం చేపల చెరువులుగా మారిపోగలవని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేపల చెరువులు తవ్వకానికి అనుమతి పెట్టిన పెద్దరైతులు వేములపల్లి సురేంద్రనాద్ బెనర్జీ, త్రిపురనేని శ్రీవెంకటేశ్వరప్రసాద్‌లు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఊడ్పునకు చివర, ముంపునకు ముందు ఉండే పొలాలైనందున కొన్నేళ్లుగా నష్టాలు చవిచూస్తున్నామ న్నారు. 48 మంది రైతులకు చెందిన 187 ఎకరాలను తవ్వేందుకు దరఖాస్తు చేసుకున్నామనీ, చివరనున్న ఒక్క రైతు మాత్రమే అభ్యంతరం చెప్తున్నారని పేర్కొన్నారు. 8 శాఖల అనుమతులు పూర్తయి నేడు ఫిషరీస్ శాఖకు ఫైల్ చేరుకున్న మాట వాస్తవమేనని చెప్పారు.